4 సిట్టింగ్‌లకే..

బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితా వెల్లడి



- ఉప్పల్‌లో మాత్రం బండారి లక్ష్మారెడ్డి ఖరారు
- ఆశావహులకు తప్పని భంగపాటు.. పక్కచూపులు చూస్తున్న నేతలు
- తనయుడు జెడ్పీ చైర్మన్ కావడంతో.. డైలమాలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి
- మేడ్చల్ టికెట్‌పై హామీ ఇస్తే కాంగ్రెస్‌కు మారే అవకాశం..!
- వ్యతిరేక చర్యలకు పాల్పడితే వేటు తప్పదని అధినేత హెచ్చరిక

సాక్షి, మేడ్చల్ జిల్లా: అధికార బీఆర్‌ఎస్ ముందస్తుగా అభ్యర్థుల జాబితాను సోమవారం ప్రకటించింది. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, వచ్చే ఎన్నికల్లో పోటీకి ఉప్పల్ సెగ్మెంట్ మినహాయించి మిగతా మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మళ్లీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే అవకాశం కల్పించారు. దీంతో మరో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా అభ్యర్థులను మార్చనున్నారనే రాజకీయ వర్గాల ఊహాగానాలకు తెరపడినట్లయింది. అధిష్టానం ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల్లో నలుగురు ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా, ఒకరు మాత్రమే బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు ఉండటం విశేషం. ఇదిలా ఉంటే గతకొంత కాలంగా ఎమ్మెల్యే టికెట్‌పై ఆశలు పెంచుకున్న మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌రావు, మాజీ మేయరు బొంతు రామ్మోహన్ ఆశావహులకు ఈ సారి కూడా నిరాశే మిగిలింది. మళ్లీ టికెట్ లభించగలదని ఆశ పడిన ఉప్పల్ సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి అధిష్టానం మొండి చెయ్యి చూపింది. తండ్రుల స్థానంలో తనయులు చామకూర మహేందర్‌రెడ్డి, మైనంపల్లి రోహిత్‌లు పోటీ చేయాలని భావించినా భంగపాటు తప్పలేదు.

ఆశావహులకు భంగపాటు

మేడ్చల్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి టికెట్ ఆశించినా భంగపాటు తప్పలేదు. గత ఏప్రిల్ మాసంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించిన సందర్భంలో సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధినేతల సమక్షంలోనే వాగ్వాదాలు, తోపులాటలకు దిగిన విషయం తెలిసిందే.. మేడ్చల్ నుంచి మళ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థిని తానేనని పలు ఆత్మీయ సమ్మేళనాల్లో ప్రకటించటంతోపాటు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో సహా ఆయన తనయుడు జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి ఆహ్వానించకపోవడం వంటి విషయాల నేపథ్యంలో ఇరువురి మధ్య విభేదాలు పొడచూపినట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగింది.

పార్టీ వ్యతిరేక విధానాలకు..

బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించిన అధిష్టానం.. జిల్లాతో సహా నియోజకవర్గాల్లో నాయకులు, కేడర్ అంతా కలిసికట్టుగా పనిచేయాలని ఆదేశించింది. అలా కాకుండా.. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడితే వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆ పార్టీ అధినేత కేసీఆర్ హెచ్చరించడం వంటి విషయాలు కూడా పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి.

మిగతా నియోజకవర్గాల్లోనూ..

కుత్బుల్లాపూర్ నుంచి ఎమ్మెల్సీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు టికెట్ ఆశించారు. అలాగే, కూకట్‌పల్లి నుంచి మరో ఎమ్మెల్సీ నవీన్ రావు కూడా టికెట్ ఆశించి భంగపడ్డారు. వీరిలో ఏ ఒక్కరిపై కూడా అధిష్టానం మొగ్గు చూపకపోవడం విశేషం. పార్టీ కోసం కష్టపడి పని చేసినా.. ప్రాధాన్యత ఇవ్వకవడంతో వారంతా అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. అవకాశం కోసం కొందరు పక్క చూపులు చూస్తున్నారు. వీరిలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే తనయుడు మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి జెడ్పీ చైర్మన్‌గా కొనసాగుతుండటం వల్ల పార్టీ మారే విషయంపై మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి డైలమాలో ఉన్నట్లు తెలుస్తోంది. పైగా కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ టికెట్ ఇస్తానని హామీ ఇచ్చినట్లయితే కూడా.. బీఆర్‌ఎస్‌ను వీడే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఏ నియోజకవర్గంలో ఎవరంటే..?

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఇందులో నాలుగింటిలో మళ్లీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే అధిష్టానం అవకాశం కల్పించింది. సిట్టింగ్ స్థానాలైన మేడ్చల్ నియోజకవర్గం నుంచి మంత్రి చామకూర మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ నుంచి కేపీ వివేకానందగౌడ్, కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి మాధవరం కృష్ణారావు, మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి మైనంపల్లి హన్మంతరావును బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా అధిష్టానం ప్రకటించింది. ఉప్పల్ నియోజకవర్గంలో మాత్రం బండారి లక్ష్మారెడ్డినికి అభ్యర్థిగా ఖరారు చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన బండారి లక్ష్మారెడ్డికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్న చర్చ ఆయన అనుచర వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో మళ్లీ సిట్టింగ్ అభ్యర్థులకే టికెట్లు ప్రకటించి, అందరినీ ఆశ్చర్యంలో ముంచేశారు. ఎన్నికలకు మరో మూడు మాసాల గడువు ఉండగా, అభ్యర్థులను ప్రకటించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మేడ్చల్ అభివృద్ధే లక్ష్యంగా..



11వ వార్డులో సీసీ రోడ్డుకు శంఖుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: మేడ్చల్ పట్టణ అభివృద్ధే లక్ష్యంగా తాము పని చేస్తున్నామని మంత్రి మల్లారెడ్డి అన్నారు. పట్టణంలోని 6, 7, 8, 11, 19వ వార్డుల్లో రూ.46 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు చేశారు. వార్డుల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో రూ.38 లక్షలతో రామగుండం ఫర్టిలైజర్ సంస్థ సహకారంతో నిర్మిస్తున్న కిచెన్, డైనింగ్ హాల్‌కు శంకుస్థాపన చేశారు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద ఉన్న ఎస్టీ హాస్టల్ వరకు నూతన బస్సు సర్వీసును ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, వైస్ చైర్మన్ రమన్నస్, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు నందారెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, కౌన్సిలర్లు సుహాసిని, శివకుమార్, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, దేవ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం తెలిపారు. మేడ్చల్‌లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. అలాగే, జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యే ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు.

మేడ్చల్ నియోజకవర్గం



పేరు: చామకూర మల్లారెడ్డి
తల్లిదండ్రులు: చంద్రమ్మ, మల్లారెడ్డి
పుట్టిన తేదీ: 09-09-1953 (70 సంవత్సరాలు)
నివాసం: బోయిన్‌పల్లి, సికింద్రాబాద్
వృత్తి: వ్యాపారం, మల్లారెడ్డి, సీఎంఆర్ విద్యాసంస్థలు, మల్లారెడ్డి మెడికల్ కళాశాల, మల్లారెడ్డి యూనివర్సిటీ, సీఎంఆర్ స్కూల్స్, ఫంక్షన్ హాల్స్, వ్యవసాయం, మల్లారెడ్డి గ్రూప్స్ చైర్మన్.
భార్య: చామకూర కల్పన
సంతానం: కుమారులు చామకూర మహేందర్‌రెడ్డి, డాక్టర్ భద్రారెడ్డి, కుమార్తె మమతారెడ్డి
రాజకీయ నేపథ్యం: 2014లో మల్కాజ్‌గిరి ఎంపీ(టీడీపీ), 2019లో మేడ్చల్ ఎమ్మెల్యే(బీఆర్‌ఎస్), రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి.
విద్యార్హత: ఇంటర్మీడియట్

రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికలకు సంబంధించి అన్ని విషయాల్లో రాజకీయ పార్టీల నాయకులు ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు తమ సహకారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి కోరారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల ముసాయిదా జాబితా ప్రచురణలో భాగంగా సోమవారం నుంచి అక్టోబర్ 19 వరకు ఏమైనా అభ్యంతరాలు, వాదనలు ఉన్నట్లయితే తెలపాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో, వచ్చే నెల 2, 3 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎలక్ట్రోరల్ తుది జాబితాను అక్టోబర్ 4న ప్రచురించడం జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ సూచనలు, నిబంధనల మేరకు నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు చేయడంతో పాటు నూతనంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం ఇప్పటి వరకు మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం ఓటర్లు 25,90,145 మంది ఉండగా, ఇందులో పురుష ఓటర్లు 13,44,351, మహిళా ఓటర్లు 12,45,469 మంది ఉన్నారు. ఇతర ఓటర్లు 325 మంది ఉండగా, సర్వీస్ ఓటర్లు 731 మంది ఉన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలి

ఏఐటీయూసీ నేత వీఎస్ బోస్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఆరు రోజులుగా నిరవధికంగా సమ్మె నిర్వహిస్తున్న రెండవ ఏఎన్‌ఎంలను ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ నేత వీఎస్ బోస్ విమర్శించారు. ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన రెండవ ఏఎన్‌ఎంల ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో మేడ్చల్ ఏఐటీయూసీ నాయకులు పి.శంకర్‌రావు, ఏఎన్‌ఎంల యూనియన్ నాయకురాళ్లు నాగమణి, తిరుపతమ్మ, గుణవతి, లలిత పాల్గొన్నారు.

పారదర్శకంగా మద్యం దుకాణాలకు లక్కీ డ్రా



సాక్షి, మేడ్చల్‌జిల్లా:మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి ఎక్సైజ్ సర్కిళ్లలోని మద్యం దుకాణాలకు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతీ హోళికేరి, జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ లక్కీ డ్రా నిర్వహిచారు. నగరంలో నాగోల్ అనంతుల రాంరెడ్డి గార్డెన్స్‌లో సోమవారం నూతన ఎక్సైజ్ పాలసీ ప్రకాం 2023–25 సవంత్సరానికి సంబంధించి మద్యం దుకాణాలకు లాటరీ పద్ధతిలో కేటాయించారు. మేడ్చల్ ఎక్సైజ్ సర్కిల్‌లో 114 మద్యం దుకాణాలు ఉండగా 7,519 దరఖాస్తులు రాగా, మల్కాజిగిరి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 88 మద్యం దుకాణాలకు 6,722 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ మాట్లాడుతూ మద్యం దుకాణాల కేటాయింపుల ప్రక్రియ లక్కీ డ్రా పద్ధతిన పూర్తి పారదర్శకంగా నిర్వహించామన్నారు.

అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న బీఆర్‌ఎస్

కీసర: కీసర ఏరియా(కీసర మండలం) పరిధిలోని 73 చర్చిలకు సంబంధించి ఏర్పాటు చేసుకున్న కీసర ఏరియా పాస్టర్స్ అసోషియేషన్(కాపరి) సభ్యులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిచేందుకు కృషి చేయనున్నట్లు దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణితాశ్రీకాంత్‌గౌడ్ అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని అహ్మద్‌గూడలోని పాల్‌డేవిడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బేతేల్ మిరాకిల్ చర్చ్‌లో నిర్వహించిన కీసర ఏరియా పాస్టర్స్ పాస్టర్స్ అసోషియేషన్(కాపరి) 10వ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. కీసర ఏరియా పరిధిలోని క్రిస్టియన్ల అభ్యున్నతికి మంత్రి మల్లారెడ్డి చొరవతో తన వంతు సహకారాలు అందిస్తామన్నారు. సమావేశంలో బిషప్ లాసరస్ లాల్‌సింగ్, కాపరి అసోషియేషన్ అధ్యక్షుడు ఆర్.కె.గాబ్రియల్, ప్రధాన కార్యదర్శి పాల్‌డేవిడ్, ఉపాధ్యక్షుడు జాన్‌రాయ్, జాయింట్ సెక్రెటరీ రెవ ఎం.స్మాలన్‌రాజ్, రాచకొండ కమిషనరేట్ అకౌంట్ ఆఫీసర్ పి.ప్రదీప్ కుమార్, నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఆశా వర్కర్ల ధర్నా

సాక్షి, మేడ్చల్ జిల్లా: సీఐటీయూ అధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ కార్యకర్తలు, నాయకులు ధర్నా నిర్వహించారు. ఇందులో యూనియన్ జిల్లా కార్యదర్శి రేవతి కళ్యాణి, సీఐటీయూ జిల్లా కోశాధికారి కే.ఉన్నికృష్ణన్ మాట్లాడారు. ఆశా కార్మికులకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, ప్రమాదవశాత్తు, సాధారణంగా మరణించిన ఆశా కార్మికుల కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించడంతో పాటు పనిభారం తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్, డీఎంహెచ్‌ఓలకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు జయ, వాసంతి, రాధా, కోమల, లలిత, మంగ, రాజకుమారి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించండి

– జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ప్రజలిచ్చే ఫిర్యాదులను పరిశీలించి వాటిని తక్షణమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్ భవనంలో సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి ప్రజల నుంచి 113 అర్జీదారులకు సంబంధించిన దరఖాస్తులను ఆయన స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఇప్పటి వరకు శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అవుషాపూర్‌లో ఓపెన్ జిమ్ ప్రారంభం

ఘట్‌కేసర్: అవుషాపూర్ గ్రామంలో మేడ్చల్ గత అదనపు కలెక్టర్ నిధులతో సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెరెడ్డి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను సోమవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరై రిబ్బన్ కట్ చేసి జిమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి సునిత, నాయకులు మశ్చేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయిలు, చంద్రయ్య, ముత్యాలు, కుమార్, మహేశ్, వెంకటేశ్, కృష్ణ, సల్మాన్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో బీఆర్‌ఎస్ సంబురాలు

ఘట్‌కేసర్: బీఆర్‌ఎస్ మేడ్చల్ నియోజకవర్గం అభ్యర్థిగా మంత్రి మల్లారెడ్డిని సీఎం కేసీఆర్ ప్రకటించడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్‌ఎస్ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శి రమేశ్, కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో డ్రైనేజీ పనులు

పోచారం: నారపల్లిలోని శ్రీమహాలక్ష్మిపురంలో దాతల సహకారంతో ప్రారంభమైన డ్రైనేజీ పనులను చైర్మన్ కొండల్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. అనంతరం బాబానగర్‌లో రూ.5 లక్షల వ్యయంతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించారు.

ఎస్‌ఎఫ్‌ఐ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం



సాక్షి, మేడ్చల్ జిల్లా: విద్యారంగ సమస్యలు, సంక్షేమ వసతి గృహాల వసతులపై ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు, విద్యార్థుల మధ్య తోపులాట, వాగ్వాదాలు చోటుచేసుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కలెక్టరేట్‌లోకి చొచ్చుకొని వెళ్తున్న విద్యార్థి నాయకులతోపాటు విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసి, వ్యక్తిగత పూచికత్తుపై విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్.సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో గురుకులాలు, మోడల్ స్కూళ్లలో సమస్యలు పేరుకుపోయాయన్నారు. మెస్ బిల్లులను విడుదల చేయాలని, యూనివర్సిటీలో పెంచిన ఫీజులను తగ్గించాలన్నారు. విద్యారంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సుమంత్, చంద్రకాంత్, కిరణ్, అరుణ్, వంశీ, కార్తీక్, ఎండీ.ఆదిల్, మహమ్మద్ అలీ, ప్రసాద్, నిఖిల్, మహేశ్వర్, సతీష్, పవన్ పాల్గొన్నారు.


బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

కీసర: రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని మహారాష్ట్ర జింటూర్ ఎమ్మెల్యే మేఘన సరోకేబోర్డికర్ అన్నారు. సోమవారం నాగారం మున్సిపల్ పరిధిలోని మారుతి గార్డెన్‌లో నిర్వహించిన ఉమ్మడి కీసర మండలం(నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలు, కీసర మండలం) ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెల్యే ప్రవాస్ యోజన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అవినీతి, కుటుంబపాలన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో ప్రజలందరికీ తెలియజేసేందుకు బీజేపీ నేతలంతా కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు బీజేపీ కార్యకర్తలంతా ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లి నరేంద్రమోదీ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరంమోహన్‌రెడ్డి, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్యాంసుందర్‌శర్మ, రవీందర్‌గౌడ్, ఏనుగు రాజిరెడ్డి, లక్ష్మీవేణుగోపాల్, నాగమల్లారెడ్డి, వివిధ మండలాల మున్సిపాలిటీల పదాధికారులు, శక్తికేంద్రం ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి సేవలో..

కీసర: శ్రావణ మాసోత్సవాల ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో నాగుల పంచమిని పురస్కరించుకొని కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం వేదపండితులు విశేష పూజలను నిర్వహించారు. నాగులపంచమి, శివుడికి ఇష్టమైన సోమవారం కావడంతో స్వామివారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులకు కీసరగుట్టకు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయం అభిషేకాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ తటాకం రమేష్, ఈఓ నాగేందర్, పొండర్ ఫ్యామిలీ సభ్యులు, ట్రస్టు బోర్డు సభ్యులు, భక్తులు, పండితులు బల్‌రాంశర్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీగోదాదేవి రంగనాయకస్వామి రథోత్సవం



ఘట్‌కేసర్: ఏదులాబాద్ శ్రీగోదాసమేత శ్రీమన్నార్ రంగనాయకస్వామి వారి రథోత్సవం సోమవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. మంత్రి మల్లారెడ్డి ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్, ఘట్‌కేసర్ మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, జవహర్‌నగర్ మేయర్ కావ్య, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ సురేశ్, మాజీ ఎంపీటీసీలు కుమార్‌ముదిరాజ్, రవి, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ అంజిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్ భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కాందిశీకుల భూమిని కాపాడాలని కలెక్టర్‌కు వినతి

మేడ్చల్: మండలంలోని అత్వెల్లి పరిధిలో ఉన్న కాందిశీకుల భూములను కాపాడాలని మున్సిపల్ ఒకటో వార్డు కౌన్సిలర్ మానస శ్రవణ్‌కుమార్ గుప్తా జిల్లా కలెక్టర్‌ను కోరారు. అత్వెల్లి పరిధిలోని భూములను కాపాడాలని కోరుతూ ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు. కొంతమంది భూములను అన్యాక్రాంతం చేయాలని చూస్తున్నారని, నకిలీ పత్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని పేర్కొన్నారు. భూముల్లో ఆలయాలు, ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని వాటిని కాపాడాలని కోరారు. విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బస్సు కోసం వినతి

మేడ్చల్: మేడ్చల్ నుంచి యాదగిరి గుట్టకు వెళ్లే బస్సులను మండలంలోని రావల్‌కోల్ మీదుగా నడపాలని మండల పరిషత్ వైస్ ఎంపీపీ గోపని వెంకటేషం కోరారు. ఆయన ఆర్టీసీ డీఎంకు వినతి పత్రం సమర్పించారు. యాదగిరిగుట్టకు, ఈ రూట్లోని వివిధ గ్రామాలకు వెళ్లే వారికి రావల్‌కోల్ మీదుగా బస్సు నడిపితే ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన కోరారు.

సాంకేతిక నైపుణ్యం కోసం స్టూడెంట్ చాప్టర్

ఘట్‌కేసర్: విద్యార్థుల్లో పోటీతత్వం పెంచుకునేందుకు, సాంకేతిక నైపుణ్యం మెరుగుపర్చుకునేందుకు స్టూడెంట్ చాప్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలని గీక్ ఫర్ గీక్స్ కమ్యూనిటీ మేనేజర్ సౌరబ్ మనోహర్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో గీక్ ఫర్ గీక్స్, అనురాగ్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించిన గీక్ ఫర్ గీక్స్ స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభించడానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టూడెంట్ చాప్టర్ ఉద్యోగ అవకాశాలను మెరుగు పరుస్తుందని అన్నారు. కార్యక్రమంలో డీన్‌లు విజయకుమార్, విష్ణుమూర్తి, శ్రీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ సాంఘిక సంక్షేమ విద్యాలయాల్లో స్పాట్ అడ్మిషన్లు

ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ విద్యాలయాల్లో జూనియర్ కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఈ నెల 23 స్పాట్ అడ్మిషన్లు జరుపనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల రీజినల్ కోఆర్డినేటర్ రజిని తెలిపారు. షామీర్‌పేట్‌లోని పెద్ద పర్వతాపూర్ కళాశాలలో ఎంపీసీలో 16, బైపీసీలో 29 ఖాళీలు, మేడ్చల్ కిష్టాపూర్‌లో ఎంఈసీలో 8, సీఈసీలో 9, ఉప్పల్ ఎదులాబాద్‌లో బైపీసీలో 50, మల్కాజిగిరి ఎదులాబాద్‌లో ఎంపీసీలో 5, బైపీసీలో 6, జగద్గిరిగుట్ట ఎంపీసీలో 1 సీటు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఎదులాబాద్‌లోని కైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ధ్రువీకరణ పత్రాలతో బుధవారం ఉదయం 11 గంటలకు హాజరు కావాలన్నారు.

నూతన ఒరవడితో ముందుకు సాగాలి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాల, ఎమ్మార్‌సెట్ కళాశాలల ఓరియంటేషన్ డే కార్యక్రమాల్లో సోమవారం మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి జీవితం ఎంతో విలువైందని, ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు నూతన ఒరవడితో ముందుకు సాగి జీవితంలో రాణించాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మల్లారెడ్డి గ్రూప్స్ కార్యదర్శి మహేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మాధవిలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబర్‌–277, 689, 691 ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను ఆర్ఐ విశ్వనాథ్ ఆధ్వర్యంలో కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని, ప్రభుత్వ భూములను పలువురు కబ్జా చేస్తూ అమాయక ప్రజలకు ప్లాట్లు కట్టబెడుతూ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీలోని శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి, శ్రీషిర్డీ సాయిబాబా దేవస్థానం శ్రీఅభయాంజనేయస్వామి, శ్రీపోచమ్మ దేవాలయం 15వ వార్షికోత్సవ పూజలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పూజల్లో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, దేవాలయ శాశ్వత చైర్మన్ అన్నంరాజు శ్రీనివాస్, అధ్యక్షుడు నిరంజన్‌బాబు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.